మట్టిరోడ్లకు మహర్దశ

కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండల కేంద్రంతోపాటు మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు, కొండూరు, గోప్లాపూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దాదాపు రూ.2 కోట్ల మంజూరయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. ఎన్ఆర్జీఎస్ పథకంలో మంజూరైన నిధుల ద్వారా గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు ఇలా..

పెంట్లవెల్లి గ్రామానికి రూ.35 లక్షలు, మంచాలకట్ట రూ.10 లక్షలు, మాధవస్వామినగర్ రూ.10 లక్షలు, మల్లేశ్వరం రూ.20 లక్షలు, కొండూరు రూ.30 లక్షలు, జటప్రోలు రూ.25 లక్షలు, గోప్లాపూర్ రూ.10 లక్షలు, తడకలవారి తండా రూ.10 లక్షలు, యంగంపల్లి తండా రూ. 10 లక్షలు ఎన్ఆర్జీఎస్ నిధులు మంజూరయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్లు నిర్మించామని ఏఈ సాయిరాం పేర్కొన్నారు.



పెంట్లవెల్లి 12వ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

ఇబ్బందులు ఉండవు



సీసీ రోడ్ల నిర్మాణంలో వర్షాకాలంలో ఇబ్బందులు రావు. గతంలో గుంతలమయంగా ఉన్న రోడ్లతో అవస్థలు పడ్డాం. చిన్నపాటి వర్షానికే మట్టి రోడ్లు బురదమయంగా మారేవి.

–చిన్నలాలు, పెంట్లవెల్లి

ఇప్పటికే పనులు ప్రారంభించాం

మండలంలో దాదాపు రూ.2 కోట్ల ఎన్ఆర్జీఎస్ నిధులు మంజూరు అయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో పనులు చేపట్టాం. నిర్ణీత గడువు లోపే పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల అధికారులకు సూచనలు చేశాం. సీసీ రోడ్లను నాణ్యతగా చేపడుతాం.

– సాయిరాం, ఏఈ

ఉపాధి కూలీలందరికి పనులు కల్పిస్తాం

కల్వకుర్తి(వెల్దండ): వేసవిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలందరికి ఉపాధి కల్పిస్తామని ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎంజీతండా, అల్లంతోటబావితండా తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో చదును చేయుట, కంపచెట్లు తొలగింపు తదితర పనులు చేపడుతున్నామన్నారు. మండలంలో 32 గ్రామాల్లో ఇప్పటి వరకు 1500 కూలీలు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీలకు ఎలాంటి బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సత్యనారాయణ, లక్ష్మీదేవి, లింగం, శివలీల తదితరులు ఉన్నారు.



ఎంజీతండాలో పనులు చేస్తున్న కూలీలు

బైపాస్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

వంగూరు(చారకొండ): మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు పనులు చేపట్టొద్దని గ్రామస్తులు, భూ నిర్వాసితులు రోడ్డు పనులు అడ్డుకున్నారు. సోమవారం ఎన్‌హెచ్ బైపాస్ పనులు చేపట్టేందుకు యంత్రాలు చేరుకున్నాయి. దీంతో గ్రామస్తులు పనులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్, మహేందర్‌ల ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసేందుకు యత్నించారు. దీంతో వారు ససేమిరా అన్నారు. సమస్యను కాంగ్రెస్ నాయకులు అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వివరించారు. గ్రామస్తులు ఈఎన్సీ అధికారులతో మాట్లాడడానికి రావాలని కోరారు. దీంతో గ్రామస్తులు హైదరాబాద్ వెళ్లారు. కార్యక్రమంలో జగన్, విష్ణు, గిరిజమ్మ, లక్ష్మణ్, బాలయ్య, నర్సింహ్మ చారి, బాల్‌నారాయణ తదితరులు ఉన్నారు.



బైపాస్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

పంచగవ్య తయారీ విధానంపై అవగాహన

తెలకపల్లి: మండలంలోని పర్వతాపూర్‌లో సోమవారం పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. గోమూత్రం, పంచగవ్య తయారీ విధానంపై విద్యార్థులు ప్రదర్శించారు. పంచగవ్యలో బెల్లం, అరటి, లేత కొబ్బరి నీళ్ళు వేసుకోవచ్చని సూచించారు. బెల్లం పానకం వాడడం వల్ల పిచికారి సమయంలో మిశ్రమం ఆకులపై అతుక్కోవడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. అరటి పండు, లేత కొబ్బరి నీళ్ల వాడడం వల్ల పులియబడే సమయం తగ్గుతుందన్నారు. పంచగవ్య చేయడం వల్ల నేలలో రైసోబియం, అజోస్పైరీరయం, అజాటోబ్యాక్టర్ వంటి సూక్ష్మ జీవులు వృద్ధి చెంది పంటకు పోషకాలు అందజేస్తాయని సూచించారు. రైతులు ఇలాంటి ప్రయోగాలు చేయడం వల్ల మంచి లాభాలు సాధించవచ్చన్నారు. ఏ నేలల్లో ఎలాంటి పంటలు వేసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు కె ద్వారకామయి, విశ్వతేజ, అనూజ, శ్వేత, సుభద్ర, రైతులు చెన్నప్ప, చిన్న నిరంజన్, వెంకటమ్మ, సాయిబాబు, బాలకృష్ణ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు



కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167కె జాతీయ రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని చెన్నపురావుపల్లి, కల్వకోలు గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్ చేయిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ పనుల్లో నిమగ్నం అయ్యారు. ఈ నెల చివరి నాటికరి మండలంలో రోడ్డు పనులు పూర్త చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



అచ్చంపేట(బల్మూర్): మండలంలోని చెన్నారం ఎంపీటీసీ ఆంజనేయులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి సోమవారం అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాతో వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు పర్వత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయనున్న కవి కాశన్న

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు కవి ఎదిరపల్లి కాశన్న తెలిపారు. విద్యార్థి దశ నుంచి సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేశానని పేర్కొన్నారు. దళితుల సమస్యలపై అంటరానితనం నిర్మూలన కోసం మహబూబ్‌నగర్ జిల్లా దళిత సమైక్య అధ్యక్షుడిగా పనిచేసినట్లు ఆయన వివరించారు.

తండా నాయక్‌గా రామారావు



మన్ననూర్: తెలంగాణలోని లంబాడ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం తండాలో నాయక్(పెద్ద మనిషి)గా ఒకరిని ఎంపిక చేయడం కొన్ని దశాబ్దాలకాలంగా వస్తున్న ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం మన్ననూర్‌లోని ఉమామహేశ్వర తండాలో ఎంఈఓ పనిచేస్తున్న రామావత్ రామారావును తండా నాయక్‌గా, హాతీరామ్, శంకర్‌లను సహ నాయకులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని లంబాడ సాంప్రదాయ దుస్తులు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాం నాయక్, బీచ్యా నాయక్, లాల్‌సింగ్, ఎంపీటీసీ రహీం, నాయకులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శివాజీ, వెంకటయ్య, గోపాల్, తిరుపతి, లోక్యా, రాంకోటి, కృష్ణ, లాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన



అచ్చంపేట రూరల్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 34 రోజుల పాటు సమ్మె చేసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జీఓ నెంబర్ 51 ని రద్దుచేసి మల్టీ పర్పస్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని డివిజన్ పరిపాలనాధికారి తబితారాణికి వినతిపత్రం అందజేశారు. కార్మికులు బాలస్వామి, వేమయ్య, సుల్తాన్, దాసు, నిరంజన్, అంజి, మహిళా కార్మికులు లక్ష్మమ్మ, మల్లమ్మ, హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, శివరాములు, మహేశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా

లింగాల: మండల కేంద్రంలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచింది. సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఇవ్వడంతో రెండు, బిందెలకన్న ఎక్కువ నీరు రావడం లేదని, 15 నిమిషాలు పాటు మాత్రమే నీటి సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. భగీరథ నీటి సరఫరా నిలిచిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కొల్లాపూర్(కోడేరు): మండలంలోని జనుంపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎండీ మహిమూద్ తీగలపల్లి నుంచి జనుంపల్లికి ట్రాక్టర్‌లో తడకల లోడ్‌తో వెళ్తున్నాడు. గ్రామానికి సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదంబారిన పడకుండా తప్పించుకున్నాడు.

ఓటరు లిస్ట్ ప్రదర్శన



కల్వకుర్తిరూరల్: స్థానిక సంస్థల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడి ఎన్నిక కోసం సోమవారం కల్వకుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు లిస్ట్‌ను ప్రదర్శించారు. కల్వకుర్తి మండలంలోని 11 మంది ఎంపీటీసీలు ఓటు వేసేందుకు అర్హులని ఎంపీఓ దేవేందర్ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

తెలకపల్లి: ఓ బాలిక అదృశ్యంమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేష్ తెలిపారు.

హామీలు నెరవేర్చకపోతే ఉద్యమిస్తాం



నాగర్‌కర్నూల్‌లో డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు



అచ్చంపేటలో ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ఆశవర్కర్లుకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య హెచ్చరించారు. సోమవారం ఆశాకార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్‌లాల్‌కు అందజేశారు. లెప్రసీ సర్వే నిర్వహించినన ఆశాకార్యకర్తలకు డబ్బులు ఇవ్వకుండా అదనపు పనిభారం పేరుతో ఆశలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గుంపల్లి అశోక్, కందికొండ గీత, శకుంతల, సువర్ణ, గౌరమ్మ, పార్వతీ, శ్రీదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీఓ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగుసార్లు లెప్రసీ సర్వే చేయించుకుని ఇప్పటివరకు డబ్బులు ఇవ్వలేదని పేర్కొన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్ మద్దతు పలికారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు సైదమ్మ, శివలీల, లక్ష్మి, పారిజాత, మణెమ్మ, శ్యామల, పద్మ, శ్రీమతమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఆశావర్కర్లకు అప్పగించిన లెప్రసీ సర్వేను రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఆశావర్కర్ల సంఘం నాయకురాళ్లు కళావతి, శ్రీదేవి, శివలీల, పద్మ, అన్నపూర్ణ, కల్పన, గౌరమ్మ తదితరులున్నారు.

వైభవంగా జ్ఞాన సరస్వతి ఆలయ వార్షికోత్సవం

కల్వకుర్తి(ఊర్కొండ): మండలంలోని ఊరుకొండపేటలో ఉన్న హరిహర జ్ఞాన సరస్వతి దేవాలయం మొదటి వార్షికోత్సవం ఆలయ నిర్మాణ దాతలు చిత్తనూరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర, నమక, చమక, అభిషేక పూజలు చేశారు. అనంతరం భూమానంద స్వాముల వారి ఆధ్వర్యంలో రుద్ర మహా యాగం, భగవద్గీత పారాయణం పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజుశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్త బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎస్ఐగా నరేష్



తెలకపల్లి: ఎస్ఐగా నరేష్ సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ నుంచి మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

కుష్టు గుర్తింపుపై ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు గ్రామాలల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ రామయ్య తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వ్యాధి మచ్చలు గల వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైద్య సిబ్బందికి సహకరించి వివరాలు అందించాలన్నారు. ఈ సర్వే ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

కొత్వాల్‌కు అభినందనలు

వనపర్తిటౌన్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఒబేదుల్ల కొత్వాల్‌ను పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఖ్తర్, అనీస్, ఖాదర్‌ఖాన్ తదితరులు సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో సేవలందిస్తున్న కొత్వాల్‌కు ఇచ్చే గుర్తింపునకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. కార్పొరేషన్ తరుపున మైనార్టీలకు అందే రుణాలను చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు



కల్వకుర్తిరూరల్: లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవ కార్యక్రమాలకు పలు అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రీజియన్ సమావేశంలో పలు అవార్డులను రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కిశన్, తర్నికల్ శ్రీనివాస్, సత్యనారాయణ, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విశ్రాంత ఉద్యోగులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని జాతీయ ఉన్నత పాఠశాలలో ఆంగ్లం ఉపాధ్యాయుడిగా పనిచేసిన హరినాథశర్మ(87) ఆదివారం మృతి చెందాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఇటీవల అతని భార్య మృతి చెందింది. కూతురు, కుమారుడికి సమాచారం ఇచ్చినా అంత్యక్రియలకు హాజరుకాలేదు. దీంతో స్థానిక విశ్రాంత ఉద్యోగులు హరినాథశర్మ అంత్యక్రియాలు చేసేందుకు ముందుకు వచ్చారు. శివాలయం ప్రధాన పూజారి సురేష్ శర్మ, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్ శెట్టి, పాండురంగయ్య, వెంకట్ రెడ్డి, లింగారెడ్డి, మోహన్, హరీష్ సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మికుల జీతాల చెల్లింపులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పి సురేష్ మాట్లాడుతూ గతంలో కార్మికుల వేతనాల పెంపుపై ఎస్ఎస్‌సీ ఏజెన్సీ కాంట్రాక్టర్ అవినీతిపై ఇప్పటికే అనేక దఫాలుగా శాంతియుతంగా ఆందోళనలు, నిరసలు తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. మూడు సంవత్సరాలకే రావాల్సిన ఏజెన్సీ టెండర్ 7 సంవత్సరాలుగా టెండర్లకు గ్రహణం పట్టిందని ఆవేధన వ్యక్తం చేశారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న 35 మంది కార్మికులకై పని ఒత్తిడి ఎక్కువ అయ్యిందన్నారు. పాత జీవో నంబర్ 68 ప్రకారం రూ.10200 వేతనం చెల్లించాలని కానీ 7 సంవత్సరాలుగా రూ.7600 ఇస్తున్నారని వాపోయారు. తక్షణమే ఎస్ఎస్‌సీ ఏజెన్సీని రద్దు చేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, అధ్యక్షుడు మధు గౌడ్, కార్మికులు బాలకిష్టమ్మ, రంజాన్‌బీ, బాలమణి, అజ్మీరా, రేణుక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు బహిర్గతం చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్లను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై, ఎన్నికల బాండ్లను అడ్డగోలుగా తీసుకొచ్చిందన్నారు. కొల్లాపూర్‌లో ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం ఎదుట, పెంట్లవెల్లిలో మండల కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట, కోడేరులో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, కల్వకుర్తిలో ఎస్‌బీఐ, తాడూరులో ఏపీజీవీబీ ఎదుట నిరసన తెలిపారు.



నాగర్‌కర్నూల్ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కొల్లాపూర్: పట్టణంలోని ఇందిరాకాలనీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కుతుబుద్దీన్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడి కుమారుడు సీపీఐ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌ను ఓదార్చారు. బాధిత కుటుంబీకులకు సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఎంపీ అభ్యర్థి భరత్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఎంపికైన భరత్ ప్రసాద్‌ను బీజేపీ నాయకులు సోమవారం ఎంపీ రాములు గృహంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అభిలాష్‌రెడ్డి, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

కళాకారుడికి చేయూత



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని మల్లేశ్వరం గ్రామానికి చెందిన నాటక ప్రదర్శన కళాకారుడు హుస్సేన్ వారం రోజుల కిందట మృతిచెందాడు. సోమవారం కళాకారులందరూ డబ్బులు జమ చేసి బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుల కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పౌరాణిక నాటకాలలో ప్రధాన పాత్రలు పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో యుగేందర్, వేణుమాధవ్, దామోదర్, నాగేశ్వర్‌రావు, ఈశ్వరయ్య, గోపాల్ పాల్గొన్నారు.

శివుడికి ప్రత్యేక పూజలు



కల్వకుర్తి(వెల్దండ): మండలంలోని గుండాలలో అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడిని అభిషేకం చేసి అలంకరించి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల భాగంగా ఉదయం 9 గంటలకు పూర్ణహుతి, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహవనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుడు జంగయ్యయాదవ్ అన్నదానం చేశారు. 12న తెల్లవారుజామున పుష్పరథోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దెలో రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలోని పలు కాలనీలలో అవసరం ఉన్న చోట సీసీ రోడ్లను నిర్మాణం చేపడుతున్నట్లు దామోదర్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై స్పష్టత ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో రాజకీయ పార్టీలు బీసీ డిక్లరేషన్‌పై స్పష్టత ఇవ్వాలని ఉమ్మడి జిల్లా నాయకుడు కాళ్ల నిరంజన్ అన్నారు. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరణ, చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.